క్లుప్తంగా

నేడు వేల్పూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

శావల్యాపురం: వేల్పూరు గ్రామంలో శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా శనివారం ఉచిత మేగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వివేకనంద పూర్వ విద్యార్థుల కమిటీ అధ్యక్షుడు సంద్రపాటి చలపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంటి వైద్య శిబిరంలో పాల్గొనే వారందరూ ఆరోగ్యశ్రీ, ఆధార్ కార్డు జిరాక్స్‌లు తీసుకొని రావాలని తెలిపారు. అనారోగ్య సమస్యలతో భాధపడే వారు మందులు వాడుకునే ఆధారాలతో శిబిరానికి రావాలని పేర్కొన్నారు. కంటి శుక్లా ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, రవాణా ఖర్చు లేకుండా భోజన వసతి కల్పించనున్నట్లు తెలిపారు. వివరాలకు 94920 81140 నంబరుకు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి దేవస్థాన వార్షికోత్సవం



వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని కొండమెట్ల లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం పదవ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దేవస్థాన భక్త బృందం ఆధ్వర్యంలో స్థానిక శివయ్య స్థూపం సెంటర్‌లో ప్రత్యేక హోమాలు, అన్న సంతర్పణ నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువనేత బొల్లా గిరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. దేవస్థాన కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గీతాంజలిలో కల్చరల్ ఫెస్ట్



వినుకొండ(నూజెండ్ల): స్థానిక గీతాంజలి స్కూల్, రెసిడెన్షియల్ క్యాంపస్, నెక్ట్స్ జెన్ కిడ్స్ విద్యార్థులకు కల్చరల్ ఫెస్ట్ శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల 23వ వార్షికోత్సవంలో పట్టణ సీఐ సాంబశివరావు, 32వ వార్డు కౌన్సిలర్ షేక్ షకీలా పాల్గొని, విద్యార్థులు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ తేళ్ల కృష్ణవేణి, కరస్పాండెంట్ వై.ఎల్.కిషోర్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో పింఛను అందజేత



నరసరావుపేట రూరల్: పక్షపాతంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న వృద్ధురాలికి ఆసుపత్రికి వెళ్లి పెన్షన్ వలంటీరు పింఛను అందజేశారు. ములకలూరు గ్రామానికి చెందిన సగిలి అనసూయమ్మ పక్షవాతంతో పదిరోజుల నుంచి నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. గ్రామ క్లస్టర్-3 వలంటీర్ లింగాల శ్రీలక్ష్మి శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి వృద్ధురాలికి పింఛను అందజేసింది. ఐసీయూలో కదల్లేని స్థితిలో ఉన్న అనసూయమ్మ వేలిముద్రలు తీసుకుని, ఆమె కుమారుడు శ్రీనివాసరావుకు నగదు అందజేశారు.

ఎన్‌సీసీ రాజుకు అవార్డు ప్రదానం



నరసరావుపేట ఈస్ట్: శ్రీ సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్కే రాజుకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎన్‌సీసీ కమాండేషన్ కార్డ్ అవార్డు లభించింది. సికింద్రాబాద్‌లోని ఏపీ, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ కార్యాలయంలో శుక్రవారం ఎన్‌సీసీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ వీఎం రెడ్డి చేతుల మీదుగా మేజర్ రాజు అవార్డు అందుకున్నారు. కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్‌గా మేజర్ రాజు అందించిన సేవలకు గాను అవార్డు లభించటంపై కళాశాల పాలక వర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపల్ డాక్టర్ సోము మల్లయ్య, అధ్యాపకులు అభినందించారు.

మేలు జరిగితేనే ఓటేయండి అన్న ఏకైక సీఎం జగన్

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి



సంక్షేమ లబ్ధిపై ఆనందం వ్యక్తం చేస్తున్న మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: 'మీకు మేలు జరిగితేనే.. నాకు ఓటు వేయండి' అన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరేనని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని 23వ వార్డు నవోదయ నగర్‌లో రెండో రోజు ఇంటింటికి ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించారు. హిందూ స్కూలు సమీపంలోని ఎల్ఈఎఫ్ చర్చి నుంచి ప్రచారం ప్రారంభించిన ఎమ్మెల్యేకు ఆ వార్డు నాయకుడు పూనూరి కోటిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్తున్నామని, ప్రజలు చాలా సంతోషంగా ఉన్నారన్నారు. దర్జీలు, రజకులు, నాయీ బ్రాహ్మణులు, మెకానిక్‌లు తమకు సీఎం జగన్ న్యాయం చేశారని వివరిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా వలంటీరు వ్యవస్థ సాయంతో ప్రతి కుటుంబానికి సంక్షేమ న్యాయం జరిగిందన్నారు.. దీనికి భయపడిన చంద్రబాబు నాయుడు జనసేనతో పొత్తు పెట్టుకొని ఇప్పుడు బీజేపీ కావాలంటూ ఢిల్లీ చుట్టూ తిరుగుతున్నారని మండిపడ్డారు. మొత్తం ఏడు పార్టీలు కలిపి యువకుడైన సీఎం జగన్‌పై ముప్పేట దాడి చేస్తున్నారన్నారు. ప్రజలకు మేలు చేయటం వల్లే వీరందరూ భయపడుతున్నారని విమర్శించారు. జగన్ మళ్లీ సీఎం అయితేనే పథకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.సుజాతా పాల్, ఏపీఐఐసీ డైరెక్టర్ కాకుమాను సదాశివరెడ్డి, మార్కెట్ యార్డు కమిటీ సభ్యురాలు బత్తుల లక్ష్మీపద్మలత, దివ్వెల రామకృష్ణ, బాదుగున్నల శ్రీనివాసరావు, బత్తుల వెంకటేష్, సమాఖ్య నాయకురాలు సయ్యద్ ఫాతిమా, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రిస్టియన్‌పాలెంలో నేతల ప్రచారం

నరసరావుపేట: ఎన్నికల్లో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని ఐదో వార్డు క్రిస్టియన్ పాలెంలో శుక్రవారం పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఇంటింటికి తిరుగుతూ ఎమ్మెల్యేగా గోపిరెడ్డిని గెలిపించుకొని.. ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని కోరారు. రాష్ట్రానికి సీఎంగా జగన్ అయితేనే సంక్షేమ పథకాలు అమలవుతాయని ప్రజలకు వివరించారు. మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల ఎజ్రా, పంగులూరి విజయకుమార్, కుక్కల పోలు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై భరోసా

సీఎంఆర్ఎఫ్ నగదు చెక్కులు పంపిణీ చేసిన సమన్వయకర్త రాజేష్ నాయుడు



చెక్కును అందజేస్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: పేదల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎన్నికల కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధిత కుటుంబాలకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ వర్తించని వారికి నేరుగు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సందెపూడి గ్రామానికి చెందిన బొగ్గవరపు ప్రకృతికి రూ.1.10 లక్షలు, పురుషోత్తమ పట్నంకు వాసి ఆశా కమలాదేవి రూ.45వేలు, జాలాది నివాసి కూరాకుల సంపత్‌రావుకు రూ.25 వేల నగదు చెక్కులను అందజేశారు.

ఆలయ వార్షికోత్సవ పోస్టర్లు ఆవిష్కరణ

చిలకలూరిపేట: మనిషిని సన్మార్గంలో నడిపించేది ఆధ్మాత్మికమే అని, దీంతో జీవితంలో ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు అన్నారు. ఈ నెల 7న పట్టణంలోని పోలిరెడ్డిపాలెం వద్ద నల్లకుంటపై వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం 30వ వార్షికోత్సవ పోస్టర్‌ను శుక్రవారం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు అబ్బూరి సిద్దయ్య, మిరియాల సురేష్, పార్టీ పట్టణ మహిళా అధ్యక్షురాలు యాదాల సుజాత, నాయకులు తీయ్యగూర అంజిరెడ్డి, బాలకోటి నాయక్, కుప్పాల శంకర్, కోట నాగపూర్ణ చంద్రరావు, ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిన్నారులకు పోలియో చుక్కలు

యడ్లపాడు: పల్స్ పోలియో కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం సమర్థంగా నిర్వహిస్తోందని యడ్లపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.ప్రభాకరరావు పేర్కొన్నారు. పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహణపై శుక్రవారం ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలో ఐదేళ్లలోపు చిన్నారులు 4,040 మంది ఉండగా వీరికి 5,200 డోసులు వచ్చాయని తెలిపారు. వీరిలో 3,681 మంది గ్రామాల్లో ఉండగా, హైరిస్క్ ప్రాంతాలైన నూలుమిల్లులు, క్వారీలు, ఇటుక బట్టీలు తదితర 24 ప్రాంతాల్లో మరో 359 చిన్నారులు ఉన్నట్లు చెప్పారు. వీరందరికీ ఆదివారం పోలియో చుక్కల్ని వేసేందుకు 29 బూత్‌లు, ఒక మొబైల్ వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. 127 మంది వైద్య ఆరోగ్య సిబ్బంది, మరో మూడు పర్యవేక్షకణ బృందాలు ఉంటాయని వివరించారు. ప్రజలు, వలస కూలీల కుటుంబాలు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని స్పష్టం చేశారు. పీహెచ్‌సీ వైద్యులు భరద్వాజా, సీహెచ్‌వో ఎస్.పున్నారావు, ఆరోగ్య పర్యవేక్షకులు వి.రాజశేఖర్, బి.గంగానమ్మ ఉన్నారు.

శాస్త్రీయ విజ్ఞానంతో మానవాభివృద్ధి



బహుమతి అందజేస్తున్న సభ్యులు

చిలకలూరిపేటటౌన్: విద్యార్థులు శాస్త్ర విజ్ఞానం పెంపొందించుకొని మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షుడు కాపు వెంకట్రావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని రోటరీ కార్యాలయంలో జాతీయ సైన్సు దినోత్సవం నిర్వహించారు. శాస్త్రీయ విజ్ఞానం అలవర్చుకోవడం ద్వారా మానవాభివృద్ధికి పాటుపడవచ్చన్నారు. ముందుగా విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయుడు గుగ్గిలం వీరరాఘవును సన్మానించారు. అనంతరం విద్యార్థులకు మానవ అభ్యుదయంలో శాస్త్రీయ విజ్ఞానం పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాగులపాటి చంద్రశేఖరరావు, ఆళ్ల వేమన రెడ్డి, తోటకూర వెంకటనారాయణ, గళ్లా సాంబశివరావు, కందిమళ్ల సాంబశివరావు, తియ్యగూర యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి



బొల్లాపల్లి : రావులాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఎం.దేవయ్య మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబాన్ని పరామర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌గా గ్రామానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని అన్నారు.

పవిత్ర హృదయంతో ప్రార్థించాలి



ప్రత్యేక ప్రార్థన చేస్తున్న కానుకమాత చర్చి విచారణ గురువు రెవ.ఫాదర్ వైఎల్ మర్రెడ్డి

రెంటచింతల: తపస్సు కాల దీక్ష తీసుకున్న మాలధారులు పవిత్ర హృదయంతో యహోవాదేవుని కుమారుడైన ఏసుక్రీస్తును ప్రార్థించాలని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు నిర్వహించిన గ్రామంలోని వివిధ ప్రాంతాలలో నున్న పలు మందిరాల వద్ద ప్రత్యేక ప్రార్థనలలో భాగంగా 14 స్థలాల కార్యక్రమంలో ఫాదర్ మర్రెడ్డి భక్తులకు తపస్సు కాలం విశిష్టతను వివరించారు. లోకరక్షకుడైన ఏసుక్రీస్తు అంతిమ ఘడియలలో శిలువ వేయబడి పడిన కష్టాలను క్రైస్తవులు స్మరించుకుంటూ 40 రోజుల పాటు ఉపవాస దీక్షలను తీసుకుని నిండు హృదయంతో ఉపవాసం, ప్రార్థన, దాన ధర్మాలు చేయాలన్నారు. మాలధారులు మార్చి 31వ తేదీ వరకు 40 రోజుల పాటు ఈ తపస్సుకాల ప్రార్థనలలో భాగంగా ప్రతి బుధ, శుక్రవారాలలో సాయంత్రం నిర్వహిస్తున్న ఏసుక్రీస్తు శిలువ ధ్యానం గుర్తుచేస్తు 14 స్థలాల పాట్లను స్మరించుకుంటూ ప్రార్థనలలో పాల్గొనాలన్నారు. సహాయ గురువులు ఫాదర్ అగస్టీన్, మఠకన్యలు, చర్చి పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

బెల్లంకొండ: వేసవి నేపథ్యంలో దాహార్తి కోసం అడవుల నుంచి బయటకు వస్తున్న జీవుల పట్ల ప్రతి ఒక్కరూ సహృదయంతో ఉండాలని పాపాయపాలెం సెక్షన్ డీఆర్‌వో రమణయ్య కోరారు. శుక్రవారం వెంకటాయపాలెం గ్రామస్తులకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. అటవీ జంతువులను వేటాడేందుకు అడవులలో ఉచ్చులు పెట్టడం, విద్యుత్ తీగలు అమర్చడం వంటి చర్యలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అడవులలో చెట్లను నరికి ఆక్రమణలు చేయడం, అడవులకు నిప్పు పెట్టడం వంటివి చట్టరీత్యా నేరమని తెలిపారు. ఎఫ్‌బీవో కృష్ణమూర్తి పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల విస్తృత పర్యటన



గ్రామంలో పర్యటిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ కల్పశ్రీ



గ్రామోదయం కార్యక్రమంపై సమీక్షిస్తున్న అధికారులు



అమీన్‌సాహెబ్‌పాలెం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో జాకీర్ హుస్సేన్

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు, వేల్పూరు, శావల్యాపురం గ్రామాల్లో మండల స్థాయి అధికారులు శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. పోట్లూరు గ్రామంలో మండల ప్రత్యేకాధికారి మూలె వెంకట రెడ్డి పర్యటించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు సమన్వంతో బాధ్యతగా వ్యవరించాలన్నారు. శావల్యాపురంలో ఎస్సీ కాలనీలో ఎంపీడీఓ కొత్రపాటి కవితా చౌదరి పర్యటించి, అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పని చేయాలని సూచించారు. ఆరోశ్రీ కార్డులు పంపిణీ పూర్తిచేయాలని ఆదేశించారు. వేల్పూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిప్యూటీ తహసీల్దారు వేములవెంకట నాగరాజు సందర్శించారు. బంగారు తల్లి పథకం ద్వారా కిశోర బాలికలకు పౌష్టికాహారం అందించి, హిమోగ్లోబిన్ శాతం తగ్గకుండా ఉపాధ్యాయులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం గ్రామాల వారిగా జరిగిన గ్రామోదయం కార్యక్రమంపై ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులు సమీక్షించారు. ఏంపీఎం జి.వాసుబాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజరు కుప్పం శ్రీలత, పంచాయతీ కార్యదర్శులు అశోక్ చౌదరి, యుగంధర్, మహేంద్ర, వైద్య ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

వి.అప్పాపురంలో అసిస్టెంట్ కలెక్టర్ పర్యటన

వినుకొండ(నూజెండ్ల): వి.అప్పాపురం గ్రామంలో శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. అసిస్టెంట్ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ గ్రామంలో పర్యటించారు. పారిశుద్ధ్యం, అంగన్‌వాడీ కేంద్రాలు, విలేజీ క్లినిక్, జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు, పట్టాల రిజిస్ట్రేషన్, డ్రెయిన్లను పరిశీలించారు. స్థానిక పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడారు. హిమోగ్లోబిన్ శాతం తక్కువ ఉన్న బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగి, వారిని సత్కరించారు. మండల ప్రత్యేకాధికారి బి.రవిబాబు, మండలాధికారులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రెండు గ్రామాల్లో గ్రామోదయం

నాదెండ్ల: అమీన్‌సాహెబ్ పాలెం, తూబాడు గ్రామాల్లో అధికారులు రెండు బృందాలుగా శుక్రవారం గ్రామోదయం కార్యక్రమం నిర్వహించారు. అమీన్‌సాహెబ్‌పాలెంలో ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ బృందం, తూబాడులో తహసీల్దార్ డీవీవీ వరకుమార్ బృందం పర్యటించింది. అమీన్ సాహెబ్‌పాలెంలో సచివాలయాన్ని సందర్శించి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించారు. అనంతరం ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. రక్తహీనత తక్కువగా ఉన్న విద్యార్థునులను గుర్తించి, వారికి బంగారుతల్లి కార్డులు అందించారు. తల్లిదండ్రులకు బంగారు తల్లి పథకంపై అవగాహన కల్పించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మమేకమయ్యారు. గ్రామానికి చెందిన ఆర్థోపెడిక్ పూనాటి కృష్ణ విద్యార్థులకు పౌష్టికాహార పంపిణీకి ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ అందించామని, తద్వారా విద్యార్థులు నూరుశాతం ఫలితాలు సాధించాలని ఎంపీడీవో షేక్ జాకీర్‌హుస్సేన్ కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రశాంతి, ఏపీఎం సాంబశివరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉష, స్థానిక నాయకులు గుర్రం రాజేష్, సచివాలయ, అంగన్‌వాడీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిఫలం ఆశించని సేవ వలంటీర్లది

'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

బొల్లాపల్లి : దేశంలో ఏ రాష్ట్రంలో కూడా అమలులో లేని నూతన పరిపాలన విధానాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ముందుకు దూసుకుపోతోందని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం సాయంత్రం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. వలంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సచివాలయం, వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చి సుపరిపాలన అందిస్తున్నారన్నారు. ఈ వ్యవస్థల ద్వారా గడప గడపకు సంక్షేమాభివృద్ధి పథకాలు అందాయని చెప్పారు. వలంటీర్లు సత్ప్రవర్తన, మంచి నడవడికతో సేవలు అందించారని కొనియాడారు. ప్రతిఫలం ఆశించకుండా మంచి చేయాలనే ఉద్దేశంతో సేవ చేయడమే వలంటీర్ల లక్ష్యమన్నారు. వారి సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి, అవార్డులతో సత్కరిస్తున్నట్లు చెప్పారు. కరోనా కష్ట కాలంలో వలంటీర్ వ్యవస్థ మెరుగైన సేవలు అందజేసిందని గుర్తుచేశారు. అనంతర అవార్డులు, ప్రశంసా పత్రాలను వలంటీర్లకు అందించి, వారిని అభినందించారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సచివాలయ, పార్టీ కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

అయ్యన్నపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

బొల్లాపల్లి: అయ్యన్నపాలెం గ్రామ సచివాలయ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ పి.సాయిబాబు ప్రారంభించారు. వైద్య సిబ్బంది రోగులకు ఉచితంగా పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. మందులు పంపిణీ చేశారు. బొల్లాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.శంకరనారాయణ, ప్రత్యేక వైద్యనిపుణులు కె.కాంతారావు, కె.నాగార్జున రెడ్డి, ఎస్కే చాంద్ బాషా వైద్య పరీక్షలు చేశారు. 401 మందికి వైద్య సేవలు పొందారని, వీరిలో 51 మందికి కంటి వైద్య పరీక్షలు చేసి, కళ్లజోళ్లు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి శంకరనారాయణ తెలిపారు. కారంపూడి పీహెచ్‌సీ సీహెచ్ఓ కె.మల్లయ్య, వైద్య, ఆరోగ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ వేగంగా పూర్తిచేయండి

ఇళ్ల పట్టాలు, ఓటరు జాబితాపై మున్సిపల్ కమిషనర్ సమీక్ష

నరసరావుపేట: జగనన్న ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగంగా పూర్తిచేయాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి ఆదేశించారు. శుక్రవారం రిజిస్ట్రేషన్‌లకు సంబంధించి మున్సిపల్ బంగ్లాలో వార్డు నోడల్ అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. లబ్ధిదారులతో మాట్లాడి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. సాంకేతిక అంశాలు ఎదురైతే సంబంధిత బృందానికి పంపించి, పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఓటరు జాబితాపై పట్టణానికి సంబంధించిన బీఎల్వోలతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ఫారం 6, 7, 8 అర్జీదారులతో మాట్లాడి, ఎలాంటి డాక్యుమెంట్స్ వారి నుంచి తీసుకోవాలనే విషయాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. క్షేత్రస్థాయిలో ఏ విధమైన సమస్యలు వచ్చినా నేరుగా తన దృష్టికి తీసుకోస్తే.. పరిష్కరిస్తానని కమిషనర్ పేర్కొన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా సక్రమంగా పని చేయాలని స్పష్టం చేశారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ నరసింహారావు, సూపర్‌వైజరు సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

యడ్లపాడు: ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని గ్రామ పంచాయతీ సర్పంచ్ షేక్ కరీమూన్ అన్నారు. లింగారావుపాలెం గ్రామ సచివాలయం ప్రాంగణంలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. యడ్లపాడు ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్యశిబిరంలో పీహెచ్‌సీ వైద్యులు భరద్వాజ, స్పెషలిస్టులు డాక్టర్లు ప్రశాంతి, లక్ష్మీదీప్తి, సుబ్బారావు 423 మంది రోగులకు వివిధ పరీక్షలు నిర్వహించి, వైద్యసేవలు అందించారు. ఉచితంగా మందులు ఇచ్చి, ముగ్గురిని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 91 మందికి కంటి సంబంధిత పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చారు. కొందరిని కళ్లజోళ్లకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సీహెచ్‌వో ఎస్.పున్నారావు, సూపర్‌వైజర్లు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశవర్కర్లు, గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు.


పోలింగ్ కేంద్రాల తనిఖీ



క్రోసూరు జెడ్పీ పాఠశాలను పరిశీలిస్తున్న తహసీల్దారు సువర్ణ

క్రోసూరు: మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను శుక్రవారం తహసీల్దార్ ఎం.సువర్ణ తనిఖీ చేశారు. మండలంలోని ఊటుకూరు, బయ్యవరం, విప్పర్ల, క్రోసూరు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. నాలుగు గ్రామాల్లో 20 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. పోలింగ్ స్టేషన్ నంబర్ 122 నుంచి 131, 139 నుంచి 148 వరకు ఉన్న పీఎస్‌లు పరిశీలించారు. అక్కడి పాఠశాలలు పీఎస్‌గా ఎన్నికలు నిర్వహణకు అనువుగా ఉన్నట్లు తెలిపారు. కిటికీలు, వెంటిలేషన్, తలుపులు, బల్లలు అన్ని బాగా ఉన్నట్లు తెలిపారు. ఆమె వెంట ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



పట్టాలపై పడి ఉన్న మృతదేహం

సత్తెనపల్లి: రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని సుమారు 45 సంవత్సరాలు వయస్సు కలిగి తెల్లచొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్ వెళ్తున్న 12703 ఫలక్‌నుమా సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ సుమారు ఉదయం 9:07 గంటలకు సత్తెనపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగింది. వందేభారత్ రైలు వస్తుండటంతో క్రాసింగ్‌లో భాగంగా ఫలక్‌నుమా ఆగింది. ఈ క్రమంలో ఆగి ఉన్న రైలు కిందకు వెళ్లగా ఒక్కసారిగా రైలు కదలడంతో నడుముపైగా రైలు వెళ్లి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆత్మహత్యకు పాల్పడ్డాడా? లేక ప్రమాదవ శాత్తు జరిగిందా అనేది విచారణలో తేలాల్సి ఉంది. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతుడి వివరాలు సేకరిస్తున్నారు. మృతదేహన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

నేడు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు

క్రోసూరు: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో క్రోసూరు, అచ్చంపేట పరిధిలోని బేటీ బచావో, బేటీ పఢావో కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో స్వర్ణకుమారి శుక్రవారం తెలిపారు. అచ్చంపేటలోని సాయిబాబ కల్యాణ మండపంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.